క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ


సిరిపురం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యా బోధనను పరిశీలిస్తున్న ఎంఈఓ

నడిగూడెం : ప్రతిఒక్కరూ విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు కోరారు. గురువారం మండలంలోని సిరిపురం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, నారాయణపురం ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థు హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యా బోధనను, విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు బుర్రి శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, శ్రీనివాస్, సీఆర్పీ గోవర్ధన్, తదితరులు ఉన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి గురువారం ముదిరాజ్ సంఘం నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు రావణబోయిన ఉపేందర్, సభ్యులు ముత్యాలు, దాసరి మల్లయ్య, వీరబాబు, నాగరాజు, రవి పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ బహూకరణ


పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్లు అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

నడిగూడెం : మండలంలోని తెల్లబల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఐపీఎస్ అధికారి కొల్లు సురేష్ తల్లిదండ్రులు కొల్లు అప్పారావు, రాజ్యలక్ష్మి గురువారం కంప్యూటర్, రెండు ప్రింటర్లు బహూకరించారు. తను చదువుకున్న పాఠశాలకు కొల్లు సురేష్ సహకరించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జిల్లేపల్లి పద్మావతి, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు, కొంపెల్లి శ్రీనివాసరావు, సరళ, సీతారామయ్య, శ్రీహరి, యాదగిరి, సీఆర్పీ నందిగామ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

మహా రుద్రాభిషేకాన్ని జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నిర్వహణ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఎస్‌ఎస్‌పీ క్యాంపు ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 27న లోక కళ్యాణార్థం నిర్వహించబోయే మహా రుద్రాభిషేకాన్ని ఊరి పండగలా జరుపుకుని విజయవంతం చేయాలని నిర్వహణ కమిటీ సభ్యులు పి.లక్ష్మీనరసింహారావు, వి.నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని సాయిబాబా కల్యాణ మండపంలో కమిటీ సమావేశం నిర్వహించారు. మహా రుద్రాభిషేకం నిర్వహణకు మహిళ భక్త సేవకుల కమిటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు, సేవా కమిటీ మహిళా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వానిది నిర్లక్ష్య ధోరణి


సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్‌రావు

హుజూర్‌నగర్ : విద్యారంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబించడం తగదని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని శ్రామిక భవన్‌లో నిర్వహించిన పీడీఎస్‌యూ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాఖీ, ఉదయ్, నాగరాజు, ఆకాష్, ఠాగూర్, నాగ, గౌతమ్, ముఖేష్, సంతోష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో 'ఇందిరమ్మ' బిల్లులు

- 2014లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- చిలుకూరు మండలంలో 60 మందికి పైగా బిల్లులు రాని వైనం
- పదేళ్లుగా లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఇందిరమ్మ కమిటీలు ప్రాధాన్యం ఇవ్వాలని వేడుకోలు


కొమ్ముబండతండాలో పులిగోరు శైలజ పదేళ్ల క్రితం నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు


జెర్రిపోతులగూడెంలో మోదుగు పద్మ ఇల్లు

చిలుకూరు : ఇందిరమ్మ పథకం కింద 2014లో ఇళ్లు మంజూరు అయ్యాయి. వెంటనే ఇళ్లు నిర్మించుకుంటే బిల్లులు వస్తాయని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడంతో పలువురు లబ్ధిదారులు హుటాహుటిన అప్పులు చేసి మరి ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ ప్రభుత్వం మారడంతో బిల్లులు రాక అప్పుల పాలయ్యారు. ఇక చేసేది ఏమిలేక భూములు అమ్ముకుని అప్పులు తీర్చుకున్నారు. ఇదీ చిలుకూరు మండలంలోని పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి. ఇళ్లు కట్టుకుని పదేళ్లైనా బిల్లుల కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడంతో బిల్లులు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తుండడంతో మొదటి విడతలో తమకు ప్రాధాన్యం ఇచ్చి తమకు రావాల్సిన ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

60 ఇళ్లకు నిలిచిన బిల్లులు..

కాగా, 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. అయితే నాడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ వస్తుందని త్వరగా ఇళ్లు నిర్మించుకుంటే బిల్లులు వస్తాయని అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు చెప్పడంతో అప్పులు చేసి మరి వాళ్లే ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ బిల్లులు రావడం ఆలస్యం కావడం, ఆలోగా ఎన్నికల కోడ్ రావడంతో బిల్లులు నిలిచిపోయాయి. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం కాకుండా టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం లేకుండా పోయింది. వరుసగా రెండోసారి కూడా టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల ఊసేలేదు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. కాగా, చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడెం, కొముమ్మబండతండా, సీతారాంతండా, చిలుకూరు, బేతవోలు, నారాయణపురం, సీత్లాతండా, రామాపురం, ఆర్లెగూడెం, పోలేనిగూడెం, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం తదితర గ్రామాల్లో 60 ఇళ్లకు ఇంకా బిల్లులు రావాల్సి ఉంది. ఇప్పటికైనా స్థానిక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిలు తమకు అండగా ఉండి ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు విడుదల చేయించి న్యాయం చేయాలని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు కోరుతున్నారు.

పొలం అమ్మి అప్పు తీర్చుకున్నాం



2014లో నాకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైంది. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే బిల్లులు విడుదల చేయిస్తామని చెప్పడంతో అప్పు తెచ్చి ఇళ్లు నిర్మించుకున్నాం. కానీ నేటి వరకు ఇళ్ల బిల్లులు రాలేదు. అప్పు తీర్చడం కోసం మాకున్న ఎకరం పొలంలో కొంత భూమిని అమ్ముకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చినందున మా ఇంటి నిర్మాణ బిల్లు చెల్లించాలి.

– నలబోలు కళావతి, జెర్రిపోతులగూడెం

బడుగుల ఆశాజ్యోతి బీఆర్ అంబేద్కర్


గడ్డిపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ చరమందరాజు

గరిడేపల్లి : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేద్కర్ అని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. అంబేద్కర్ ఆలోచన విధానం నేటి తరం యువతకు ఆదర్శమన్నారు. యువత అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని చదువు ద్వారా ఏదైనా సాధించవచ్చని నిరూపించాలన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదివి గ్రామానికి, కుటుంబానికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో గరిడేపల్లి, పెన్‌పహాడ్ ఎస్ఐలు చలిగంటి నరేష్, రవీందర్, మాజీ ఎంపీపీ కటికం రమేష్, మాశెట్టి శ్రీహరి, ఆరేపూరి నారాయణ, మేకల శోభన్‌బాబు, జైభీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కారింగుల వెంకన్న

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో ఎన్‌ఎంకే పేరుతో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని, ఫ్యాక్టరీ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం హుస్సేన్‌బాద్‌లో జరిగిన మండల కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా దొడ్డిదారిలో అనుమతులు తెచ్చుకొని ఇథనాల్ ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారని తెలిపారు. రావిపహాడ్‌లో ఫ్యాక్టరీ నిర్మిస్తే చుట్టుపక్కల 10 కిలో మీటర్ల దూరంలో గలభూములు మొత్తం కాలుష్యమై ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. నీరు, గాలి కాలుష్యంతో రావిపహాడ్, శెట్టిగూడెం, కోటపాడు, సర్వారం, కూడలి, బుర్కచర్ల, అప్పన్నగూడెం, తండాల ప్రజలు క్యాన్సర్, కిడ్నీ, గుండె, బ్రేన్ ట్యూమర్ వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, పార్టీ డివిజన్ కార్యదర్శి పిడమర్తి లింగయ్య, చెరుకు యలయ్య, గ్రామ కార్యదర్శి గణేష్, మల్సూర్, పీవైఎల్ నాయకుడు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ కరుణాకర్

పాలకవీడు : మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ కరుణాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఏఈఓ గోపి, పంచాయతీ కార్యదర్శి వెంకట్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.వీ సుబ్బారావు, మాజీ జెడ్పీటీసీ మోతీలాల్, నర్సింహారావు, శ్రీనివాసరావు, శ్రీకాంత్, చంటీ, మల్లేష్, రామనర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


చిలుకూరు : తహసీల్దార్ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ ధ్రువకుమార్, సిబ్బంది


హుజూర్‌నగర్‌రూరల్ : వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి, అధికారులు, సిబ్బంది

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను సూపరింటెండెంట్ జోగు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, ఏపీఓ శైలజ, జూనియర్ అసిస్టెంట్ శౌరెడ్డి, యాదయ్య, ఆంజనేయులు, కార్యదర్శి గిరిజాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిలుకూరు : చిలుకూరు మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వాల్మీకి అందరికీ ఆదర్శప్రాయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో చిలుకూబరు తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, ఆర్ఐలు సీతయ్య, శ్వేత, ఆయా కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ చిత్రపటానికి పాలాభిషేకం


మఠంపల్లి : చెన్నాయిపాలెంలో మంత్రి ఉత్తమ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెం నుంచి కామాక్షికుంటతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.20 కోట్లు మంజూరు చేయించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, నిధుల మంజూరుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్ చిత్రపటాలకు గురువారం రెండు గ్రామాల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలు, నాయకులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తులసీరామ్‌నాయక్, భూక్య నాగునాయక్, భూక్య భరత్‌నాయక్, మాళోతు పున్నా, జ్యోతిశ్రీను, రవీందర్, గోవర్ధన్, సిరీ హాస్పిటల్ నాగు, బజ్జు, హతిరామ్, ఈశ్వర్, నరసింహా, శివ, సైది, లీలా, లక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుపై హర్షం

కోదాడరూరల్ : కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల మధ్య నూతన రోడ్ల నిర్మాణానికి రూ.40 కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ నాయకుడు రాయపుడి వెంకటనారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం కోదాడలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధి ఉత్తమ్‌దంపతుల తోనే సాధ్యమని అన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోపే కోదాడకు దాదాపుగా రూ.ఆరు వందల కోట్ల నిధులు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే పద్మావతికే దక్కుతుందని అన్నారు. గతంలో పాలించిన నాయకుడు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకరాక పోగా పలు పథకాల నిధులను దోచుకొని దాచుకోవడానికే సరిపోయిందని ఆయన విమర్శించారు.

కాంగ్రెస్ పార్టీ చౌటపల్లి గ్రామ అధ్యక్షుడిగా నరసింహారావు


సమావేశమైన కాంగ్రెస్ పార్టీ నాయకులు

మఠంపల్లి : కాంగ్రెస్ పార్టీ చౌటపల్లి గ్రామ అధ్యక్షుడిగా పలిశెట్టి నరసింహారావు ఎన్నికయ్యారు. గురువారం గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కందుకూరి వీరాంజనేయులును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శాగంరెడ్డి గోపాల్‌రెడ్డి, షేక్ జహంగీర్, బూషిపల్లి వెంకటరెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

హుజూర్‌నగర్ : ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకట్‌రెడ్డి, దుగ్గి బ్రహ్మం కోరారు. బుధవారం రాత్రి హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సీపీఎం మూడో శాఖ సమావేశంలో వారు మాట్లాడారు. రూ.2 లక్షల రుణమాఫీ 60 శాతం మంది రైతులకే జరిగిందని, ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని అన్నారు. తొలుత ఇటీవల మరణించిన సీపీఎం నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ మూడో శాఖ కార్యదర్శిగా వేణు, సహాయ కార్యదర్శిగా వీరబాబులను ఎన్నుకున్నారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనివ్వాలి


విద్యార్థులకు ఐడీ కార్డులు, డైరీలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, డీఎస్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిఒక్కరూ చేయూతనివ్వాలని ఎంఈఓ గురవయ్య అన్నారు. చిలుకూరు మండలంలోని నారాయణపురంలో గల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 70 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన డీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ.10వేలు విలువ గల ఐడీ కార్డులు, డైరీలు, బెల్టులు తదితర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత డీఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ దేవరం సైదిరెడ్డిని ఎంఈఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బూర లక్ష్మీనారాయణ, హెచ్‌ఎం కృష్ణయ్య, పాఠశాల చైర్మన్ మండవ రామాదేవి, ఉపాధ్యాయులు గుర్వారెడ్డి, జ్యోతి, రమణేశ్వరి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం


మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచ సూక్త విధానంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామివారిని, అమ్మవార్లను అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్ అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలని ఆందోళన

నడిగూడెం : మండలంలోని రామాపురం నుంచి రత్నవరం వరకు బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం రామాపురం గ్రామ ప్రజలు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు వర్షాకాలంలో చినుకు పడితే చిత్తడిగా మారుతుందని, దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రామాపురం గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి

మేళ్లచెరువు : రాబోయే రోజుల్లో ప్రజా పోరాటాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రామాపురంలో నిర్వహించిన పార్టీ మూడవ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ మూడవ సారీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలు అమలు చేస్తూ అమలులోకి తేవాలని చూస్తున్నారని అన్నారు. రైతులకు మద్దతు ధర చట్టం చేయాలని కోరుతున్నా నేటికీ అమలు చేయలేదన్నారు. దేశంలో ఒకే ఎన్నిక ఉండాలనే విధానం రాష్ట్రాల హక్కులను కాలరాయడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వట్టెపు సైదులు, హుస్సేన్, శీలం శ్రీను, మురళి, ప్రకాష్, శ్రీను, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ బీమా పాలసీ కలిగి ఉండాలి

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ బీమా పాలసీ కలిగి ఉండాలని గరిడేపల్లి ఎస్‌బీఐ మేనేజర్ వెంకటజయరాం అన్నారు. గురువారం మండలంలోని అప్పన్నపేట గ్రామంలో జన్ సురక్ష యోజనలో భాగంగా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన అవగాహన సదస్సులో హుజూర్‌నగర్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ పల్లి శ్రవణ్‌కుమార్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. బ్యాంక్ ఖాతాలు లేని వారు పీఎం జన్ ధన్ యోజన కింద ఖాతాలు తీసుకోవాలన్నారు. ఖాతాదారులు పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన పథకం రూ. 436, పీఎం సురక్ష బీమా యోజన కింద ఒక ఏడాదికి రూ.20లు కట్టి లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఏఎల్ఓ భిక్షం, ఎస్‌బీఐ బీసీ పాయింట్ హేమ, కుక్కడపు భిక్షం, అనంతరెడ్డి, రాంబాబు, వెంకటమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు నాటాలని వినతి

మునగాల : పల్లెప్రకృతి వనాల్లో పండ్ల మొక్కలు నాటాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ కోరారు. ఈమేరకు గురువారం మునగాల ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చెరువు కట్టలు, రోడ్ల పక్కన ఉపయోగం లేని మొక్కలను నాటుతుండడంతో పండ్ల మొక్కలు అంతరించిపోతున్నాయన్నారు. దీంతో కోతులు గ్రామాల్లోకి చొరబడి ఇళ్లపై తిరుగుతున్నాయని, పక్షులకు ఆహారం దొరకక చనిపోతున్నాయని తెలిపారు. జీవరాసులు అంతరించిపోయే ప్రమాదముందని ఇప్పటికైనా ప్రభుత్వం పండ్ల మొక్కలు విరివిగా నాటాలని డిమాండ్ చేశారు.

రోడ్లపై పశువులు.. రాకపోకలకు అవస్థలు


ప్రధాన రోడ్డుపై గుంపుగా ఉన్న పశువులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలో పశువులు రోడ్లపైనే సంచరిస్తున్నాయి. ప్రధాన రహదారిపై గుంపులుగా ఉంటున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అయినా మున్సిపల్ అధికారుల్లో చలనం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పశువులను వాటి యజమానులు రోడ్లపైకి విడిచిపెడితే గోశాలకు తరలిస్తామని గతంలో మున్సిపల్ అధికారులు చెప్పిన మాటలు నీటిమీద రాతలుగా మిగిలాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువులు రోడ్లపై తిరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు


సభ్యత్వాలు నమోదు చేస్తున్న నాయకులు

నేరేడుచర్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామాపురంలోని బీసీ గురుకుల పాఠశాల, చింతకుంట్ల, మేడారం, దాచారం, పెంచికల్‌దిన్నలలోని ప్రభుత్వ పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శ్రీనయ్య, బి.అక్కయ్యబాబు, జిల్లా మాజీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యాయులు కె.పరశురాం, నర్సింహారావు, వెంకటేశ్వర్‌రావు, కృష్ణయ్య, రషీద్ ఖాన్, వీరబాబు, జానయ్య, యాదగిరి, అన్నపూర్ణ, తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి


నేరేడుచర్ల : పశువులకు టీకా వేస్తున్న సహాయ సంచాలకుడు కందుల సత్యనారాయణ

నేరేడుచర్ల : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు కందుల సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్ల పట్టణ పరిధిలోని నర్సయ్యగూడెం, శాంతినగర్, పాత నేరేడుచర్ల, కమలానగర్‌లలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో 173 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సబెరా, విజయ్, ఇస్మాయిల్, భాస్కర్, స్వప్న, సంపత్, గోపాలమిత్రలు ఉన్నారు.

రైస్ మిల్ కార్మికులకు వేతనాలు పెంచాలి


కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను

హుజూర్‌నగర్ : రైస్ మిల్లుల యాజమానులు కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రైస్ మిల్ డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్ మిల్ కార్మికుల వేతన ఒప్పందం ముగియనున్నందున ఆయా యాజమాన్యాలు సంఘాల యూనియన్ నాయకులతో చర్చించి వేతన ఒప్పందాన్ని కుదుర్చుకుంటామని తెలిపారు. కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం లేదని వారికి కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. పని భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లాలయ్య, పర్వతాలు, తిరపయ్య, వీరబాబు, జానకిరాములు, కనకయ్య, గోపాల్, రామారావు, శ్రీను, రమేష్, అంజి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల సైదులుకు నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నేరేడుచర్ల : సీపీఎం పట్టణ శాఖ కార్యదర్శి ఎడ్ల సైదులు సంతాప సభను గురువారం నేరేడుచర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, నాయకులు కోదమగుండ్ల నగేష్, అనంత్‌ప్రకాశ్, నర్సింహా, నీలా రామ్మూర్తి, మర్రి నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, మధు, మీనయ్య, ఏసు, వెంకటేశ్వర్లు, చంద్రయ్య తదితరులు ఉన్నారు.